క్లుప్తంగా

నేడు కురుమ మహిళ సాధికారిక సదస్సు

మల్లాపూర్: ఉప్పల్ నియోజకవర్గం పరిధిలోని మల్లాపూర్ ఎన్టీఆర్‌నగర్, కురుమ బస్తీలో ఆదివారం మధ్యాహ్నం కురుమ మహిళ సాధికారిక సదస్సు నిర్వహిస్తున్నట్లు నియోజకవర్గ కురుమ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రేవ్ కృష్ణయ్య, చౌదరి పర్వతాలు కురుమ తెలిపారు. పెద్ద ఎత్తున మహిళలు సాధికారిక సదస్సు హాజరుకావాలన్నారు. కురుమ సంఘం కేలండర్‌తో పాటు ఎన్టీఆర్ నగర్ కురుమ బస్తీలో కుట్టు శిక్షణ కేంద్రాన్ని ఎమ్మెల్సీ యెగ్గె మల్లేశం చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు తెలిపారు.

కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పేదలకు వరం


చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి

హబ్సిగూడ: కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు పేదలకు వరమని ఉప్పల్ నియోజకవర్గ ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి అన్నారు. శనివారం పలువురికి కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్ కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పేరుతో అందిస్తున్న ఆర్థిక సహాయం ఆడబిడ్డలు గల పేదిళ్లలో వెలుగులు నింపుతున్నాయన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్లు ధన్‌పాల్‌రెడ్డి, కాప్రా మండల డిప్యూటీ తహసీల్దార్ రాజేందర్, ఆర్ఐ ఆనంద్, రెవెన్యూ సిబ్బంది, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీవారి కల్యాణం



కుషాయిగూడ: హెచ్‌బీకాలనీ మంగపురం శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీవారి కల్యాణ మహోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, కార్పొరేటర్ ప్రభుదాస్ స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. అనంతరం వేద పండితులు స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని శాస్త్రోక్తంగ నిర్వహించారు. ఉత్సవాన్ని తిలకించేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ వెంకన్న, మల్లేష్‌గౌడ్, సమ్మని మురళీచారి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విజయ గణపతి దేవాలయ వార్షికోత్సవం

మల్లాపూర్: మల్లాపూర్ డివిజన్ పరిధిలోని మేఫ్లవర్ అపార్ట్‌మెంట్స్‌లోని విజయ గణపతి దేవాలయం 16 వ వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. వేడుకలకు మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కేశవరం ఆంజనేయులు, వేణు, భాస్కర్,రావు, పీఆర్. ప్రవీణ్, బూరుగు మారుతీరావు, రఘు, యాదగిరి, శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

రామంతాపూర్: విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని రాష్ట్ర ప్రభుత్వ చైల్డ్ కమిటీ అధికారులు డాక్టర్ రమాదేవి, మైథిలీ అన్నారు. రామంతాపూర్ శ్రీచైతన్య స్కూల్ వార్షికోత్సవ వేడుకలు శనివారం ఇందిరానగర్‌లో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన వారు మాట్లాడుతూ.. విద్యార్థులను అన్ని రంగాల్లో ప్రోత్సహించేందుకు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో స్కూల్ ఏజీఎం సతీష్, డీన్ సుమన్, రాజేంద్రప్రసాద్, భాగ్యలక్ష్మీ పాల్గొన్నారు.

పేద యువతి పెళ్లికి చేయూత



అల్వాల్: బ్రాహ్మణ సేవా వాహిని ఆధ్వర్యంలో మల్కాజిగిరికి చెందిన సత్యనారాయణ కుమార్తె వివాహానికి బ్రాహ్మణ సేవా వాహిని రాష్ట్ర అధ్యక్షులు రఘుకిరణాచార్యులు, రాష్ట్ర కమిటీ సభ్యులు శనివారం రూ. 55 వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రఘు కిరణాచార్యులు మాట్లాడుతూ బ్రాహ్మణ సేవా వాహిని సంస్థ గత కొన్నేళ్లుగా పేదవారికి అండగా ఉంటుందన్నారు. వివాహ, ఆరోగ్య, విద్యా, ఉపాధి రంగాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు భాస్కర వజ్ఝల వెంకటేశ్వరశర్మ, అవుసూరి వెంకటేశ్వరరావు, మహిళా వాహిని వర్కింగ్ అధ్యక్షురాలు రాధమ్మ తదితరులు పాల్గొన్నారు.

జవహర్‌నగర్ పాలకవర్గంలో...

జగడం!


- 20 మంది సంతకాలతో అవిశ్వాస తీర్మానం, కలెక్టరేట్‌లో అందజేత
- బాపట్ల చేరుకున్న బీఆర్ఎస్ అసమ్మతి కార్పొరేటర్ల క్యాంపు
- రంగంలోకి దిగిన మంత్రి మల్లారెడ్డి
- అవిశ్వాసం నెగ్గాలంటే మ్యాజిక్ ఫిగర్ 18
- సమరానికి సై అంటున్న ఇరు వర్గాలు

సొంత పార్టీకి చెందిన మేయర్‌పై అవిశ్వాసానికి దిగిన కార్పొరేటర్లు



జవహర్‌నగర్: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలోని కారు గుర్తుకు చెందిన బీఆర్ఎస్ కార్పొరేటర్లు స్థానిక మేయర్ కావ్యపై కన్నెర్ర చేశారు. ఇన్నాళ్లుగా లోలోన రగిలిన అసంతృప్తి నేడు బద్దలైంది. గత కొన్ని రోజులుగా అవిశ్వాస తీర్మానంపై అడపా..దడపా.. వార్తలు వినిపించినప్పటికీ తన పదవికేమీ ప్రమాదంలేదని, మంత్రి మల్లారెడ్డి అన్ని తానై అసంతృప్తి వర్గాలను బుజ్జగిస్తాడని మేయర్ ధీమాతో ఉంది. కానీ నేడు పరిస్థితి చేయి దాటినట్లు కనిపిస్తోంది. సొంతగూటికి చెందిన కార్పొరేటర్లంతా ఏకమై ఏకంగా జిల్లా కలెక్టర్‌కే మేయర్‌పై అవిశ్వాస తీర్మాణం ప్రవేశపెట్టేందుకు అవకాశం కల్పించాలంటూ శనివారం సాయంత్రం వినతిపత్రం అందించారు. ఆ తర్వాత మేయర్ పీఠంపై కన్నేసిన ఒకరిద్దరు నేతలు అసంతృప్తి కార్పొరేటర్లందరిని తీసుకుని క్యాంపు రాజకీయాలకు తెర లేపారు. కార్పొరేటర్లంతా కలిసి బాపట్లకు పయనమయ్యారు.


బాపట్ల క్యాంపునకు తరలిన బీఆర్ఎస్ అసమ్మతి కార్పొరేటర్లు


20 మంది కార్పొరేటర్ల సంతకాలతో అవిశ్వాస పత్రం

అధికార బీఆర్ఎస్‌కు షాక్...

సొంత పార్టీకి చెందిన బీఆర్ఎస్ కార్పొరేటర్లే అదే పార్టీకి చెందిన మేయర్‌పై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టాలంటూ కలెక్టర్‌ను వేడుకోవడం స్థానికంగా తీవ్ర చర్చనీయాంశమైంది. అటు పార్టీ అధిష్టానం కానీ.. ఇటు స్థానిక మంత్రి మల్లారెడ్డి కానీ ఈ సమస్యను ఎలా గట్టెక్కిస్తారని పలువురు ఆశగా ఎదురు చూస్తున్నారు. మంత్రి రంగంలోకి దిగి అసంతృప్తులను బుజ్జగిస్తారా.. లేక వారు మంత్రి మాట వినేందుకు సిద్ధంగా ఉన్నారా.. అనేది సందేహంగా మిగిలింది. మంత్రి ప్రయత్నాలు ఫలించకుంటే చివరికి పార్టీ అధిష్టానమే రంగంలోకి దిగే పరిస్థితి నెలకొంది. ఏది ఏమైనప్పటికీ ప్రతిపక్షాలకు, జవహర్‌నగర్ కార్పొరేటర్ల తీరు ఒక విధంగా విమర్శానాస్త్రం కానుంది.

అవిశ్వాసానికి మ్యాజిక్ ఫిగర్ 18..

జవహర్‌నగర్ కార్పొరేషన్‌లో మేయర్, డిప్యూటీ మేయర్‌తో పాటు 26 మంది కార్పొరేటర్లు ఉన్నారు. వీరిలో గతేడాది 16వ డివిజన్ కార్పొరేటర్ అనారోగ్యంతో మృతి చెందింది. కాగా ప్రస్తుతం 25 మంది కార్పొరేటర్లు ఉన్నారు. ఒకవేళ అవిశ్వాసం పెడితే 18 మంది సంతకాలు అవసరమవుతాయి. కాగా ప్రస్తుత మేయర్ గట్టెక్కాలంటే ఆమెతో పాటు 9 మంది సంతకాలు చేయాల్సి ఉంది.

అంచనాలు తారుమారు...

2020లో నూతన పాలవర్గంలో కాంగ్రెస్‌కు చెందిన నలుగురు కార్పొరేటర్లు, ఇండిపెండెట్లు ముగ్గురు, 21 మంది బీఆర్ఎస్ కార్పొరేటర్లు ఉన్నారు. గతేడాది క్రితం ఇండిపెండెంట్లతో పాటు కాంగ్రెస్ పార్టీకి చెందిన కార్పొరేటర్లు మంత్రులు మల్లారెడ్డి, కేటీఆర్‌ల సమక్షంలో బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. దీంతో ప్రస్తుతం పాలకవర్గమంతా బీఆర్ఎస్ కార్పొరేటర్లే ఉన్నారు.

మేయర్ పీఠంపై ఇద్దరి కన్ను..

మేయర్ పీఠంపై 28వ డివిజన్ కార్పొరేటర్ కారింగుల నిహారిక గౌడ్, 18వ డివిజన్ కార్పొరేటర్ దొంతగాని శాంతి కోటేష్ గౌడ్‌లు కన్నేశారు. నిహారికగౌడ్ తండ్రి మాజీ సర్పంచ్ కారింగుల శంకర్‌గౌడ్ రాజకీయంగా ఎంతో అనుభవం ఉన్న వ్యక్తి కావడంతో తన కూతురు నిహారికకు మేయర్ పీఠం అప్పగించాలని మంత్రి మల్లారెడ్డి వద్ద చర్చిస్తుండగా.. కోటేష్‌గౌడ్ తన భార్య శాంతికే మేయర్ పదవి ఇవ్వాలని పట్టుబట్టినట్లు తెలుస్తోంది. అయితే వీరిద్దరిలో ఎవరికైనా తమ మద్దతు ఉంటుందని అసమ్మతి కార్పొరేటర్లు చెబుతున్నారు. కాగా శనివారం బస్సులో అసమ్మతి కార్పొరేటర్లంతా బాపట్లకు పయనమయ్యారు.

రంగలోకి మంత్రి మల్లారెడ్డి...

జవహర్‌నగర్‌లో జరుగుతున్న పరిణామాలపై మంత్రి మల్లారెడ్డి ఎప్పటికప్పుడు ఆరా తీస్తున్నారు. గత కొద్దిరోజుల క్రితమే ప్రస్తుత మేయర్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తూ అవిశ్వాసం పెడతామని మంత్రికి సూచనప్రాయంగా తెలిపారు. దీంతో పలుమార్లు ఇరువర్గాలతో మాట్లాడి వారిని సముదాయించే ప్రయత్నం చేశారు. కానీ మేయర్‌పై ఆగ్రహంతో ఉన్న కార్పొరేటర్లు మంత్రికి సమాచారం ఇవ్వకుండానే క్యాంపునకు వెళ్లిపోవడంతో రాజకీయం మరింత వేడెక్కింది. దీంతో మంత్రి మల్లారెడ్డి స్వయంగా రంగంలోకి దిగి పలువురు కార్పొరేటర్లతో స్వయంగా మాట్లాడారు. అధిష్టానం సూచనలకు అందరూ కట్టుబడి ఉండాలని సూచించినట్లు సమాచారం.

అవిశ్వాసం లేదు ఏమీ లేదు: మేయర్ కావ్య

ఐదేళ్ల వరకు తానే పదవిలో కొనసాగుతానని ప్రస్తుత మేయర్ మేకల కావ్య దీమా వ్యక్తం చేశారు. అతి చిన్న వయస్సులో మేయర్ పీఠాన్ని ఎక్కిన తాను ఎన్నో అభివృద్ధి పనులు చేసుకుంటూ ముందుకు నడుస్తున్నానని, మంత్రి మల్లారెడ్డి సహాయ, సహకారాలతో జవహర్‌నగర్‌ను అన్ని రంగాల్లో ముందుకు నడిపిస్తున్నానన్నారు. సొంత పార్టీకి చెందిన వారే ఇలా చేయడం పద్ధతి కాదని, ఇప్పటికీ మాకే అందరి మద్దతు ఉందని, వారి మాటలు పట్టించుకోవద్దని ఆమె అన్నారు.

ఎంతటి పోరాటానికైనా సిద్ధం: అసమ్మతి కార్పొరేటర్లు

మంత్రి మల్లారెడ్డి మాటలతో ఇన్నాళ్లు ఓపిక పట్టామని, ఇక సహించలేమని కార్పొరేటర్లు అల్టిమేటం జారీ చేశారు. గతంలో మేయర్, ఆమె తండ్రి వ్యవహారం ఎన్నోసార్లు వివరించామని, ఇక ఓపిక నశించి ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. జవహర్‌నగర్ అభివృద్ధే మా లక్ష్యమని, ఎంతటి సమరానికైనా సిద్ధంగా ఉన్నామని అసమ్మతి కార్పొరేటర్లు తెలుపుతున్నారు.

ప్రైవేటు పాఠశాలలతో పోటీపడాలి



వార్షికోత్సవంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ హరీష్

అల్వాల్: ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు చదువులో పోటీపడాలని జిల్లా కలెక్టర్ హరీష్ అన్నారు.శనివారం యాప్రాల్‌లో జిల్లా పరిషత్ పాఠశాల వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పించి విద్యా బోధన చేస్తుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో విద్యా బోధన చేయిస్తుందన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారిణి విజయకుమారి మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా పదో తరగతి విద్యార్థులకు పరీక్షలకు సంబంధించి అవసరమైన సౌకర్యాలు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కంటి వెలుగు సిబ్బందికి ఇక్కట్లు

- సెంటర్ ఇన్‌చార్జిల ఇష్టారాజ్యం
- భోజనం బదులు నగదు ఇవ్వాలని కోరుతున్న సిబ్బంది
- టీ, బిస్కట్లు హాంఫట్


సిబ్బంది కోసం తెప్పించిన భోజనం

మల్కాజిగిరి: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమంలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మల్కాజిగిరి సర్కిల్ పరిధిలోని ఆరు డివిజన్లలో తొమ్మిది సెంటర్లు ఏర్పాటు చే శారు. ఈ నెల 19 నుంచి కంటి వెలుగు కార్యక్రమం కొనసాగుతోంది. తొమ్మిది సెంటర్లకు ఒక నోడల్ అధికారి, ఒక మెడికల్ ఆఫీసర్, సూపర్‌వైజర్, ఇద్దరు ఏఎన్ఎంలు, ఇద్దరు ఆశావర్కర్లు, ఒక కమ్యూనిటీ ఆర్గనైజర్, ముగ్గురు ఆర్‌పీలతో పాటు జీహెచ్ఎంసీ సిబ్బంది ఒకరు విధుల్లో పాల్గొంటున్నారు. ఒక సెంటర్‌లో విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి అల్పాహారం(టీ,బిస్కట్ల)తో పాటు భోజనానికి సుమారు రూ.1500 ఇస్తున్నారు. అయితే సెంటర్ ఇన్‌చార్జిలు నాసిరకం భోజనాన్ని తెప్పిస్తున్నారని, టీ,బిస్కట్లు కూడా ఇవ్వడం లేదని ఆరోపణలు ఉన్నాయి. దీంతో పలువురు ఆశావర్కర్లతో పాటు వైద్య సిబ్బంది ఇంటి నుంచే భోజనం తెచ్చుకుంటున్నారు. తక్కువ వేతనంతో ఆశావర్కర్లుగా విధులు నిర్వహిస్తున్నామని కంటివెలుగు కార్యక్రమం కోసం బస్సు సౌకర్యం లేకపోయినా ఆటోలో వస్తున్నామన్నారు. ఇంటి నుంచి భోజనం తెచ్చుకుంటున్నామని తిరిగి ఇక్కడ భోజనం తెప్పించకుండా నగదు ఇవ్వాలని వారు కోరుతున్నారు. గతంలో మొదటి విడత కంటి వెలుగు కార్యక్రమం జరిగినప్పుడు సిబ్బందికి ఇవ్వాల్సిన నగదులో తక్కువ మొత్తం ఖర్చు చేసి మిగతా డబ్బులు కాజేసినట్లుగా ఆరోపణలు ఉన్నాయి. ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని తమకు నగదు అందజేయాలని ఆశావర్కర్లు, వైద్య సిబ్బంది కోరుతున్నారు.

చెత్త ఆటో డ్రైవర్లకు లైసెన్స్ తప్పనిసరి


అవగాహన కల్పిస్తున్న కాప్రా సర్కిల్ అధికారులు

మల్లాపూర్: జీహెచ్ఎంసీ కాప్రా సర్కిల్‌లో చెత్త ఆటోలను నడిపే డ్రైవర్లు తప్పనిసరిగా లైసెన్స్ ఉంటేనే ఆటోలను నడపాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాగరాజు అన్నారు. శనివారం డీసీ శంకర్, ఏఎంహెచ్‌వో స్వప్నరెడ్డి ఆదేశాల మేరకు మల్లాపూర్ డంపింగ్ యార్డు వద్ద చెత్త ఆటో డ్రైవర్లకు లెసెన్స్, ఆర్సీ, ఇన్సూరెన్స్‌పై అవగాహన కల్పించారు. చిన్న పిల్లలతో డ్రైవింగ్ చేయించరాదని, లైసెన్స్ లేకుండా బండి నడిపితే ట్రాఫిక్ అధికారులతో మాట్లాడి సీజ్ చేయిస్తామని తెలిపారు. కార్య క్రమంలో సర్కిల్ ఇన్‌చార్జి ఖాన్, ఆటో యూనియన్ అధ్యక్షులు చెక్క శ్రీను. ప్రధాన కార్యదర్శి సీహెచ్ నాగప్ప, చెక్క ఫకీరప్ప, సూపర్‌వైజర్ గీతాంజలి, రాందాస్, పాపారాయుడు, ఈశ్వర్, వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాలో దేశానికే ఆదర్శం


పైప్‌లైన్ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, కార్పొరేటర్

రామంతాపూర్: తాగునీటి సరఫరాలో తెలంగాణ రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలిచిందని ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్రావుతో కలిసి రామంతాపూర్ భగాయత్ బస్తీ సాబేరా కాలనీలో తాగునీటి పైప్‌లైన్ పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో రామంతాపూర్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు ఎండి ముస్తాక్ స్థానిక సంక్షేమ సంఘం ప్రతినిధులు మహ్మద్ జాహంగీర్, రజాక్, నాగలక్ష్మీ, గౌస్, షమీం, అశ్వత్, బీఆర్ఎస్ నాయకులు వెంకటేశ్వర్‌రెడ్డి, శంకర్, నరేష్ పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో రథసప్తమి వేడుకలు




అల్వాల్/గౌతంనగర్: అల్వాల్‌లోని బాలాజీ వెంకటేశ్వర ఆలయంలో శనివారం రథసప్తమి వేడుకలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి స్వామివారికి ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. అనంతరం అల్వాల్ పురవీధులలో స్వామివారిని సూర్యప్రభ రథంపై ఊరేగించారు. ఈ సందర్భంగా అల్వాల్‌కు చెందిన మాదవరావు దంపతులు స్వామివారికి రూ.20 వేలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ రాజా గోపాల్ సైంచర్, ఈవో నరేందర్, భక్తులు పాల్గొన్నారు. గౌతంనగర్ డివిజన్ పరిధిలోని మల్లికార్జుననగర్ మల్లన్న దేవాలయం, ఉత్తంనగర్‌లోని దుర్గా జ్యోతిష్యాలయంలో రథసప్తమి వేడుకలు ఘనంగా నిర్వహించారు.

వక్ఫ్ బోర్డు స్థలాల పేరుతో రిజిస్ట్రేషన్లు ఆపడం దారుణం


ధర్నా చేస్తున్న ఇంటి స్థలాల బాధితులు, నేతలు

బోడుప్పల్: వక్ఫ్ బోర్డు స్థలాల పేరుతో ప్రభుత్వం ఇంటి స్థలాల రిజిస్ట్రేషన్లను ఆపడం దారుణమని ఐక్య కార్యాచరణ సమితి చైర్మన్ బుర్ర దత్తాత్రేయ శాస్త్రి, కో చైర్మన్ కుంభం కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. బోడుప్పల్‌లో శనివారం ఇంటి స్థలాల బాధితులతో కలిసి అంబేడ్కర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ధర్నా, వంట వార్పు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 20 ఏళ్ల క్రితం నిర్మించుకున్న ఇళ్లను వక్ఫ్ బోర్డు పేరుతో ఆపుతున్నారన్నారు. ఇళ్లు నిర్మించుకుని ఇంటిపన్నులతోపాటు అన్ని రకాల టాక్స్‌లు చెల్లిస్తున్నామన్నారు. 2018లో వక్ఫ్ బోర్డు పేరుతో రిజిస్ట్రేషన్లు నిలుపుదల చేయడం వల్ల వందలాది కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు. స్థలాల యజమానులకు మంత్రి మల్లారెడ్డి గతంలో హామీ ఇచ్చి ఇప్పటి వరకు నెరవేర్చలేదన్నారు. స్థల యజమానులందరం ఐక్యంగా సమస్యను పరిష్కరించుకుందామని వారు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కొత్త దుర్గమ్మగౌడ్, శ్రీధర్‌రెడ్డి, రాపోలు రమేష్, విక్రమ్‌రెడ్డి, కొత్త కిశోర్‌గౌడ్, గోనె శ్రీనివాస్, కొంపల్లి మోహన్‌రెడ్డి, ప్రగతి, నర్సింగ్‌రావు పాల్గొన్నారు.

కమనీయం.. వేంకటేశ్వరుని కల్యాణం




ఉప్పల్: ఉప్పల్ స్వరూప్ నగర్‌లోని శ్రీ కరిగిరి వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం శనివారం కనుల పండువగా జరిగింది. వేడుకను చూసేందుకు భక్తులు వేలాదిగా తరలి వచ్చారు. ఉప్పల్ నియోజకవర్గ టీఆర్ఎస్ నాయకులు బండారి లక్ష్మారెడ్డి, ఇన్‌స్పెక్టర్ గోవింద్ రెడ్డి స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అంతకు ముందు బ్రహ్మోత్సవాల్లో భాగంగా రథసప్తమి సందర్భంగా సూర్యప్రభ వాహన సేవ నిర్వహించారు. స్వామి వారి కల్యాణం అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్త కందాడి శ్రీనివాసా చార్యులు మాట్లాడుతూ ప్రసిద్ధి చెందిన శ్రీ కరిగిరి వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న భక్తులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

బోరు బావికి మరమ్మతులు చేపట్టాలి

మల్లాపూర్: మల్లాపూర్ అంబేడ్కర్ సంఘం శ్మశాన వాటికలో రెండేళ్ల క్రితం బోరు బావి చెడిపోయింది. పలు మార్లు ప్రజా ప్రతినిధులకు సంబంధిత ఇంజినీరింగ్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని అంబేడ్కర్ సంఘం ప్రతినిధులు ఆరోపిస్తున్నారు. దహన సంస్కారాలకు వచ్చే వారు వాటర్ ట్యాంకర్‌తో కార్యక్రమాలను చేసుకోవాల్సివస్తుందన్నారు. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు, అధికారులు జోక్యం చేసుకుని బోర్‌కు మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.

వ్యక్తి అదృశ్యం

మేడిపల్లి: ఓ వ్యక్తి అదృశ్యమైన సంఘటన మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. వివేకానంద నగర్ కాలనీలో నివాసం ఉంటున్న దొడ్డి మల్లయ్య(47)ఈ నెల 25న ఉదయం ఇంటినుంచి బయటికి వెళ్లి తిరిగిరాలేదు. కుటుంబసభ్యులు అతడి కోసం గాలించినా ఫలితం లేకపోవడంతో శనివారం మేడిపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.